క్లుప్తంగా

నవమి ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి.స్వామి గోపూజ, పందిరిపూజ, పసుపు దంచడం, శ్రీ సీతారాముల వారిని వధూవరులను చేయుట, కలవస్థాపన, మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీలేరులో..

పీలేరు రూరల్ : స్థానిక సదుం మార్గంలోని శ్రీ కల్యాణ సీతారామస్వామి వారి దేవస్థానములో శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె. రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. బుధవారం ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, అలంకరణ, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం పుష్పపల్లకీ ఊరేగింపు ఉంటుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

మదనపల్లె సిటీ: పోలీసులు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని టు టౌన్ సీఐ యువరాజ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోలీసు సిబ్బంది జనరల్ హెల్త్ చెకప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడికి గురవుతుంటారన్నారు. ప్రతి ఆరు నెలలకు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్యుల సలహాలు తీసుకుని ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మాంజలి, వైద్యులు, ఎస్.ఐ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ మట్లవారిపల్లె గ్రామంలో వెలసిన శిగరేశ్వరస్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పూజారి శివశంకర ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జి.నారాయణప్ప, గోవింద్, జి.దొరబాబు, వేణు, టి.శ్రీనివాసులు, మెరుంపల్లి విజయ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తాగునీటి సమస్యపై స్పందించాలి

తంబళ్లపల్లె: వేసవి కారణంగా మండలంలోని గ్రామాలలో తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శులు వెంటనే స్పందించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆదేశించారు. సోమవారం పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో పర్యటించి తాగునీటి పరిస్థితి పరిశీలించి, సమస్య ఉంటే పరిష్కరించాలన్నారు. తాగునీటిని అక్రమంగా వినియోగిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచుల ద్వారా సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కొంత విద్యుత్ బిల్లులు చెల్లించాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టాభిరాముడి కల్యాణానికి సర్వం సిద్ధం

వాల్మీకిపురం: వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు స్థానిక తోటవీధిలో టీటీడీ అధికారులు ముమ్మరంగా కల్యాణోత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణోత్సవానికి జిల్లా వ్యాప్తంగా వేలల్లో భక్తులు తరలిరానున్నారు. భక్తులను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా షెల్టర్, చలవపందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం జరగనున్న శ్రీ పట్టాభిరాముడి కల్యాణోత్సవానికి టికెట్లు అందుబాటులో ఉన్నాయని ఆలయ అధికారి క్రిష్ణమూర్తి తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించి టికెట్లు పొందాలని ఆయన సూచించారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి పని చేయాలి

వాల్మీకిపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడానికి కష్టపడి పని చేయాలని మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. సోమవారం పట్టణంలోని బండమకాన్‌వీధిలో ఇంటింటికి పర్యటించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. పేద ప్రజల అభివృద్ధి, వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధితో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి దాదాపు రెండు లక్షల నుండి పది లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. మీ బిడ్డ ద్వారా మీ ఇంట్లో లబ్ధి జరిగితేనే ఓటు వేయండని ధైర్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెబుతున్నారని, ఆయన ఇచ్చిన ధైర్యంతోనే మీ వద్దకు వచ్చి మీరు పొందిన లబ్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నామన్నారు. చంద్రబాబు కూటమి చెప్పే మాటలు మోసపూరితమైనవన్నారు. ఈ కార్యక్రమంలో ఆఘా మొహియుద్దీన్, అబ్దుల్ కలీమ్, సైఫుల్లా, చికెన్‌మస్తాన్, షాహెద్, సాధిక్, కేశవ రెడ్డి, రఘు, ఖాదరి, బబ్లూ, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ





మదనపల్లె: ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక విన్యాసాలు నిర్వహిస్తున్న సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మదనపల్లె : ప్రజలు అప్రమత్తంగా ఉండటంవల్ల అగ్ని ప్రమాదాలను నివారించుకోవచ్చని స్థానిక ఫైర్ ఆఫీసర్ జి.శివప్ప అన్నారు. సోమవారం పట్టణంలోని చిత్తూరుబస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్, టమాటామార్కెట్, నీరుగట్టువారిపల్లె, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రెండోరోజు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని, మండే స్వభావం కలిగిన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా వంటింట్లో గ్యాస్‌లీక్ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పొరపాటున అగ్నిప్రమాదం సంభవిస్తే దాన్ని అడ్డుకునే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ కారణంగా వాటిల్లే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.అగ్నిప్రమాదం జరిగిన వెంటనే 101కు లేదా 08571-222101కు ఫోన్‌చేసి సమాచారం అందిస్తే అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో తక్షణమే స్పందిస్తామన్నారు. అనంతరం ఆయా జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు. ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక యంత్రంతో విన్యాసాలు నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

పీలేరు రూరల్ : అగ్నిప్రమాదపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్ర అధికారి ఎస్. మస్తాన్ అన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలు ఎలా అదుపు చేయాలో డెమో చేసి చూపించారు. అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని దుకాణదారులకు కరపత్రాలు అందజేసి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది హేమాద్రి రెడ్డి, నాగిరెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, వెంకటరమణ, రవి, రెడ్డిశేఖర్, సఫీ, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

వాల్మీకిపురం: అగ్నిప్రమాదాల సమయంలో అప్రమత్తత ముఖ్యమని, ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి మస్తాన్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ఎల్‌పిజి గ్యాస్ లీకుల వల్ల కలిగే ప్రమాదాలను ఎలా నివారించాలి..? ఎలాంటి జాగ్రత్తలను తీసుకోవాలని అనే అంశాలను వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. అపార్ట్‌మెంట్లలో నివసించే వారు విధిగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు. ఫైర్ సిబ్బంది బాబయ్య, శ్రీనివాసులు, రాజగోపాల్ నాయక్, మురళీమోహన్‌నాయక్, కిరణ్‌బాబు, ఇమ్రాన్ బాషా, బలరాం నాయక్, చైతన్యకుమార్ యాదవ్, భాస్కర్, శివశంకర్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



టి.సదుంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



నందిరెడ్డిగారిపల్లెలో ఇంటింటా ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి కవితమ్మ

పెద్దతిప్పసముద్రం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలన్నా, అర్హులకు న్యాయం జరగాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని తంబళ్లపల్లి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండలంలోని టి.సదుం పంచాయతీలో పర్యటించారు. పాపాగ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ పార్వతీ సమేత సంఘమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం టి.సదుంలో గడప, గడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరి ఉంటే మళ్ళీ ఇదే ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రజలందరూ నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు మంజూరు చేసిన ఘనత జగనన్నదే అని ధీమా వ్యక్తం చేశారు. ఏనాడు ప్రజల మధ్య లేని నాయకులు ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పడానికి వస్తారని, అలాంటి నేతల కల్లి బొల్లి మాటలు నమ్మవద్దన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలంతా చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. జగనన్న నిర్వహించిన జగనన్న సిద్ధం సభలు విజయవంతం కావడం, మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని చంద్రబాబు, వైఎస్ జగన్‌పై భౌతిక దాడులకు ప్రేరేపించారని ఆయన మండి పడ్డారు. చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని సవాల్ విసిరారు. ఆయన వెంట ప్రజా ప్రతినిధులు,నాయకులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, గణపతిరెడ్డి, రియాసత్ అలీఖాన్, కొండా సిద్దార్థ, ఆర్‌పీ క్రిష్టారెడ్డి, సుబ్బరాం, పీఎస్ మధు, సీపీ వేణుగోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, నవీన్‌రెడ్డి, బొమ్మే వెంకట్, కేఎస్ ఈశ్వర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, రేకులగుంటి ఈశ్వర్‌రెడ్డి, కుంచే శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గడప గడపకు సంక్షేమం

కురబలకోట: గడప గడపకు సంక్షేమ పాలన అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ అన్నారు. సోమవారం ఆమె నందిరెడ్డిగారిపల్లె సర్పంచ్ షాహీదా, వైఎస్సార్ సీపీ నాయకులు మదార్ సాబ్, అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి ఆధ్వర్యంలో ఆగ్రామాల్లో ఇంటింటా విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. మహిళలు, రైతులు, పేద, మధ్యతరగతి వారి సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగించాడన్నారు. నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, బి. దస్తగిరి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అమరనాధరెడ్డి, కోళ్ల వాసుదేవరెడ్డి, ఉప సర్పంచ్ సత్యం, బండపల్లె శ్రీనివాసులరెడ్డి, బండపల్లె కృష్ణారెడ్డి, అమరనాధరెడ్డి, చేనేత నగర్ మల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆర్బీకే శివశంకర్ రెడ్డి, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముద్ర దాము, జేసీఎస్ మండల నేత ఆర్సీ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

పెద్దమండ్యం: గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాం.. ఎప్పుడూ చూడని అభివృద్ధిని చూశారు.. జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి తనయుడు పెద్దిరెడ్డి అభినయ్‌రెడ్డి ఓటర్లను కోరారు. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీలో సోమవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రచారం కోసం వచ్చిన ఎమ్మెల్యే తనయునికి స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. గ్రామ పరిధిలోని మట్లివారిపల్లె, రెక్కలకొండపల్లె, కొత్తపల్లె, బుషిరెడ్డిగారిపల్లె, ధనరాజుగారిపల్లె, సాకలపల్లె, కుంటకిందపల్లె, వెంగంవారిపల్లె, సీ గొల్లపల్లె, చిన్నాయునివారిపల్లె, గంగతాతగారిపల్లె, నగిరి, కొలిమికాడపల్లె, బాటవారిపల్లెల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శిద్దవరం విశ్వనాధరెడ్డి, ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, గ్రామ సర్పంచ్ కంటి విశ్వనాధరెడ్డి, వైస్ ఎంపీపీ శారదమ్మ, వాటర్‌షెడ్ చైర్మన్ శివయ్య, మాజీ ఎంపీపీ పి.ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మొఘల్ చాంద్‌భాషా, జెఎస్‌వి కన్వీనర్ కన్నపు రెడ్డెప్పరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

హరిమందిరం ప్రారంభం

వాల్మీకిపురం: సీఎస్‌ఆర్ రైస్ మిల్ అధినేత చింతల శ్రీధర్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మించిన కొత్త హరిమందిరాన్ని సోమవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, నరసింహులు, లక్ష్మినారాయణ, పాపాడు, చంద్రమోహన్, ఆంజిబాబు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు సహకరించండి

గుర్రంకొండ: ఐసీఐసీఐ బ్యాంకు ఫౌండేషన్ తరపున మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టబోయే సేవా కార్యక్రమాలకు సహకరించాలని బ్యాంకు ఫౌండేషన్ డెవలెప్‌మెంట్ అధికారి రాజేశ్వరి, అసిస్టెంట్ అధికారి ధరణీశ్వరిలు ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డిని కోరారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను కలిసి తమ సంస్థ తరపున చేపట్టబోయే కార్యక్రమాలు ఆయనకు వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీఐసీఐ బ్యాంకు ప్రతి ఏటా ప్రభుత్వానికి చెల్లించే పన్నులను ఇకపై ప్రజా సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సంస్థ నిర్ణయించిందన్నారు. ఇందుకోసం తగిన ప్రణాళికలను రూపొందించుకొన్నామన్నారు. ప్రతి గ్రామంలోను గ్రామసభలు నిర్వహించి ఆయా గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులు, ఇతరత్రా సౌకర్యాలపై ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకొంటామన్నారు. అత్యవసరమైన పనులను వెంటనే చేపడతామన్నారు. ఇందు కోసం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో పాటు సచివాలయ ఉద్యోగులు తమకు సహకరించాల్సిందిగా కోరారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం ఈవిషయమై మండల స్థాయిలో సమావేశం నిర్వహించి తమ సిబ్బందికి తెలియజేస్తామని ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి పేర్కొన్నారు.

ఎన్నికలపై పీఓ, ఏపీఓలకు శిక్షణ



మాట్లాడుతున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : అసెంబ్లీ, పార్లమెంట్ సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణపై ప్రిసైడింగ్(పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్(ఏపీఓ) అధికారులకు సోమవారం పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అవలంబించాల్సిన విధివిధానాలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగ అంశాలపై ఆర్వో, ఆర్డీఓ హరిప్రసాద్ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై పీఓ, ఏపీఓలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఉల్లంఘనలు లేకుండా కచ్చితంగా మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. నిర్లక్ష్యంతో ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తీవ్రమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. శిక్షణ తరగతులను తేలికగా తీసుకోవద్దని..... ఒకవేళ ఇంతకుముందు ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ నుంచి ఎప్పటికప్పుడు వస్తున్న నూతన నియమాలను తెలుసుకోవడానికి శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పోలింగ్ ప్రారంభించేందుకు 90 నిమిషాల ముందు మాక్‌పోలింగ్ నిర్వహించే విధానం వివరించాలన్నారు. మాక్ పోలింగ్‌లో 50కి తక్కువ కాకుండా ఓట్లు వేయాలని, వేసిన ఓట్లు వీవీప్యాట్‌లోని స్లిప్పులతో సరిచూసిన తదుపరి ఈవీఎంను క్లియర్ చేసి అనంతరం నిర్దేశిత సమయంలోనే పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలింగ్ ప్రక్రియపై 300 మందికి శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్వోలు రమాదేవి, ప్రమీల, బాలాజీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి ఉత్సవాలు



సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : మండలంలోని గుడిబండ శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం తొగటవీరక్షత్రియుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి సింహ వాహనంపై అలంకరించిన చాందినీబండిపై చౌడేశ్వరిదేవిని గ్రామ పురవీధులలో ఊరేగించారు. అమ్మవారి రథం ముందు కళాకారులు చేసిన నృత్యాలు, కోలాటం, చెక్క భజనలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ అమ్మవారికి ఏటా బోనం సమర్పణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ఆలయం వద్ద అమ్మవారి జ్యోతులు అగ్ని గుండ ప్రవేశం చేశాయి. భక్తులకు శెట్టి చలపతి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సీఎం జగన్‌తోనే మరింత మంచిపాలన

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్
- కొత్తపల్లె పంచాయతీలో మౌలికవసతుల కల్పనకు కృషి
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా నాయకుల విస్తృత ప్రచారం



కొత్తపల్లె పంచాయతీలో ఓటువేయాలని వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో మరింత మంచి పాలన సాధ్యమని, రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటువేసి వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మండలంలోని కొత్తపల్లె పంచాయతీ శాంతిపురం, దండువారిపల్లెలో సోమవారం సాయంత్రం పర్యటించిన నిసార్‌అహ్మద్‌కు ప్రజల నుంచి ఘనస్వాగతం లభించింది. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కావాలంటే మనమంతా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. ఎన్నికల వేళ సూపర్ సిక్స్ అంటూ టీడీపీ కూటమి నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అడుగడుగునా దక్కుతున్న ప్రజాదరణ చూసి, ఓటమిభయంతోనే టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు అండ్ కో జగనన్నపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఆపలేరన్నారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థిగా నిసార్‌అహ్మద్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండుకరుణాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మహేష్, నాయకులు వెలుగు చంద్ర, డాక్టర్.ఏ.వి.సుబ్బారెడ్డి, మయూరిరఘునాథ్ రెడ్డి, ఎంపీటీసీ బస్రి, బావాజాన్, ఇస్మాయిల్, సోమశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లికార్జుననాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం పట్టణంలోని 11, 22 వార్డుల్లో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ భార్య తస్నీమ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, కౌన్సిలర్లు ముబీనా, సలీం తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కూటమి నేతలకు గుణపాఠం చెప్పాలి

- రెండోసారి వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యం
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ఎన్నికల్లో ఓటమి భయంతో కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న కూటమి నేతలకు గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సోమవారం మండలంలోని తలపుల, మేళ్లచెరువు, జాండ్ల, గూడరేవుపల్లె పంచాయతీలలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేము సిద్ధం బస్సుయాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు. జగన్‌కు లభిస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేకనే రాయితో దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆయన సోదరుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పక్కరాష్ట్రంలో విలాసవంతమైన జీవితం గడుపుతూ నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు వచ్చిన సమయంలో మాత్రమే వారికి ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. ఈ నెల 22న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు చిన్నకొండయ్య, శిరీష, నీలిమ, ఎంపీటీసీ వెంకటరమణ నాయుడు, కిరణ్‌కుమార్‌నాయుడు, కృష్ణమ్మ, నాయకులు మల్లికార్జునరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, తిమ్మయ్య, మస్తాన్, సతీష్‌నాయుడు, సురేంద్రరెడ్డి, రవి, చిన్నబాబు, కుసుమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

కలకడ : సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఝరిగడ్డలోని తిప్పారెడ్డి మామిడతోటలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. ముఖ్యమంత్రిపై దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. ప్రజలకు కష్టకాలంలో కిరణ్ కుమార్‌రెడ్డి కనీసం ఒక్కరిని అయిన ఆదుకున్నారా అని ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసమే వారికి పీలేరు గుర్తుకు వస్తుందన్నారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్ రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సిద్దయ్య,తిప్పారెడ్డి, కుమార్‌రెడ్డి, ఆర్వి, షావత్‌అల్లీఖాన్, కెఎస్‌మస్తాన్, ప్రదీప్‌రెడ్డి, వెంకట్రమణరెడ్డి, లక్ష్మన్న, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

కేవీపల్లె : సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి.. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వగ్గల పంచాయతీలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు అభివృద్ధి చెందినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు రామకొండారెడ్డి, వెంకటసిద్ధులు, జయరామచంద్రయ్య, రఘునాథరెడ్డి, ఖాదర్‌బాషా, హర్షవర్ధన్‌రెడ్డి, రాస్‌మల్లిఖార్జునరెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, భాను, లక్ష్మీదేవి, పి. ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

131 మంది వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

మదనపల్లె : మండల వ్యాప్తంగా సోమవారం నాటికి 131 మందికి పైగా వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంపీడీఓ భానుప్రసాద్‌కు రాజీనామా పత్రాలు అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్ కల్యాణ్‌లు వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తాము మూకుమ్మడిగా రాజీనామాలు చేసినట్లు తెలిపారు. బసినికొండ గ్రామసచివాలయంలో 17మంది, కొండామర్రిపల్లె 11, తట్టివారిపల్లె 18, కొత్తవారిపల్లె-2లో 7, అంకిశెట్టిపల్లె 13, వైఎస్సార్ కాలనీ సచివాలయం24, సీటీఎం-1 సచివాలయంలో 25, బొమ్మనచెరువు సచివాలయంలో 16 మంది మొత్తం...131మంది వలంటీర్లు రాజీనామాలు సమర్పించారు.

నిమ్మనపల్లెలో..

మండలంలోని తవళం గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్న ఆరుగురు రాజీనామా చేశారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షాలెట్‌ను కలిసి వలంటీర్లు సీ.ఆర్.మాలతి, బి.హరిత, ఏ.మల్లీశ్వరి, కే.భరత్‌కుమార్, కే.సరస్వతి, జి.నాగభూషణంలు కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

రామసముద్రం: మండలంలోని ఊలపాడు సచివాలయంలో పని చేస్తున్న 13 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను డిజిటల్ అసిస్టెంట్ వాసుదేవరెడ్డికి అందజేశారు.

గుర్రంకొండ: వలంటీర్లపై టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ మండలంలోని గుర్రంకొండ, కండ్రిగ, సంగసముద్రం, ఎల్లుట్ల, శెట్టివారిపల్లె, టి.పసలవాండ్లపల్లె గ్రామాలకు చెందిన 76 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయానికి చేరుకొన్న వలంటీర్లు తమ రాజీనామ పత్రాలను ఒకొక్కరుగా ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డికి సమర్పించారు.

కలికిరి: మండలంలో వలంటీర్లు తమ విధులకు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ పరిధి కలికిరి-3 గ్రామ సచివాలయం నందు 12 మంది, మర్రికుంటపల్లి గ్రామ సచివాయం నుంచి 15 మంది, అద్దవారిపల్లి సచివాలయం నందు 09 మంది, పారపట్ల సచివాలయ పరిధిలో నలుగురు, మొత్తం 40 మంది వలంటీర్లు సోమవారం తమ విధులకు రాజీనామా చేసి ఆయా సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. దీంతో మండలంలో ఇప్పటి వరకు 107 వలంటీర్లు విధులకు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ రామక్రిష్ణయ్య తెలిపారు.

పీలేరు : మండలంలో 76 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వేపులబైలు గ్రామ సచివాలయం పరిధిలో 13 మంది, అగ్రహారంలో 9 మంది, బండ్లవంకలో 28 మంది, రేగళ్లలో 12 మంది, తలపుల గ్రామ సచివాలయంలో 14 మంది తమ రాజీనామ పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవడానికే తాము రాజీనామా చేసినట్లు తెలిపారు.